ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : జి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 9 | మే 2024

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 24

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .


నమ్మాళ్వార్ – భక్తికి పరాకాష్ట .................... 2

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు....... 6

భగవద్గీత ...................................... 21

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం



ఉన్నది బ్రహ్మం ఒక్కటే, అందులో నీవు ఐక్యమవ్వాలి. దేహము నేను అనే భావన తీసివేస్తే గాని నీవు బ్రహ్మంలో ఐక్యమవ్వలేవు. అన్ని అనర్థాలకు దేహము నేను అనే భావనే కారణం.



# నమ్మాళ్వార్ - భక్తికి పరాకాష్ఠ

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి సేకరణ)**

అందరికీ ఎంతో కొంత భక్తి, ప్రేమ ఉన్న మాట నిజమే, శ్రద్ధ ఉన్న మాట నిజమే. కాని మనం పొందవలసిన గమ్యం ఏమిటి అనే దాంట్లో మీకు ఏమైనా స్పష్టత ఉందా? మనం పొందవలసింది పొందామా లేదా అని కాదు, అసలు మనం పొందవలసింది ఏమిటి అనేదాంట్లో మీ మనసులో ఇప్పటికి కూడా ఒక నిర్ణయానికి రాలేదు. సాధన అంటే, మనసును శుద్ధి చేసుకోవడమే సాధన. మనస్సుని వదిలేసి నేను సాధన చేస్తాను అంటే కుదరదు. మీరు సాధన చెయ్యటం వల్లనే మోక్షం వస్తే అది నిజమైన మోక్షం కాదు. మన సాధనలు మనసులోని దుమ్ము దులుపుకోవటం కోసం, దానివలన మనసులో ఉన్న అనారోగ్యం పోతుంది అంతే. మోక్షం అక్కడ రెడీగానే ఉంది మన కోసం.

సాధన చెయ్యటం వలన ఆత్మ తెలియబడదు, ఆత్మ మన హృదయంలోనే ఉంది. మీరు సాధన చెయ్యటం వల్ల ఆత్మ తెలిస్తే, అంటే మళ్ళీ మీరు సాధన మానేస్తే ఆత్మ పోతుందా! మనం చేసే సాధన తోటి, మనం చేసే ప్రయత్నం తోటి ఆత్మకి ఏమీ సంబంధం

లేదు. ఆత్మ ఎన్నడూ బంధంలో లేదు, దానికి మోక్షం అక్కరలేదు. ఆత్మ మన హృదయంలో ఎప్పుడూ ప్రకాశిస్తోంది, మనం అహంకారం నుండి బయటపడటానికి మోక్షం అనే పేరు పెట్టాము. జ్ఞానాన్నే మోక్షం అంటారు. మనకున్న అజ్ఞానమే దుఃఖరూపంలో వస్తుంది, రాగ ద్వేషాల రూపంలో వస్తుంది. యదార్థం చెప్పాలంటే మీరు నేను ఇక్కడ కూర్చుని మాట్లాడుకోవటం స్వప్నమే, ఇది నిజం కాదు. కాని ఆత్మ నిజం.

విష్ణుభక్తులు నమ్మాళ్వారు ఏమన్నారు అంటే "ఓ స్వామి ఇంత కాలం నువ్వు వేరు, నేను వేరు అనుకున్నాను. కాని ఇప్పుడు తెలిసింది. ఎప్పుడు అంటే నిన్ను తెలుసుకున్నాక తెలిసింది, నేను లేను నువ్వు ఉన్నావు అని, అంటే జీవుడు లేడు, దేవుడు ఉన్నాడు" అని. ఆయన భక్తుడు కదా! కానీ మనం ఏమనుకుంటున్నాం అంటే దేవుడు లేడు మనం ఉన్నాము అనుకుంటున్నాము. నమ్మాళ్వారు లోకం యొక్క క్షేమం కోసం పుట్టాడు. ఈ లోకంలో పదహారేళ్ళో, పద్దెనిమిదేళ్ళో బ్రతికాడు అంతే. అతను తల్లి గర్భంలోనుంచి పుట్టిన ఐదు సంవత్సరాల వరకు మలం విడిచి పెట్టలేదు, మూత్రం విడిచి పెట్టలేదు, మళ్ళీ తల్లితండ్రులు ఇంటికి తీసుకుపోతారు అని. అపుడు తల్లితండ్రులు వీడికి మలం రావటంలేదు మూత్రం రావటంలేదు, మాట మాట్లాడడు, వైద్యులు ఏమీ చేయలేకపోతున్నారు, వీడెందుకు మనకి, వీడొక సుద్దలా ఉన్నాడు, ముద్దు ముచ్చట లేదు, అనుకున్నారు. ఒక ఐదు సంవత్సరాలు పెంచారు. అపుడేం చేసారంటే, ఒక గుళ్ళోకి తీసుకెళ్ళి, ఉయ్యాల కట్టి, ఆ ఉయ్యాలలో పడుకోబెట్టి, ఇక మనకి వీడికి సంబంధం లేదు అనుకొని ఇంటికి వెళ్ళిపోయారు. తల్లితండ్రులను ఇంటికి వెళ్ళిపోనిచ్చాడు, తరువాత ఈయన లేచి నడిచి వెళ్ళిపోయాడు. అంటే, వాడు లోకం కోసం మన కోసం వచ్చాడు. నెమ్మదిగా నడిచి వెళ్ళి ఒక చెట్టు తొర్రలో కూర్చున్నాడు. పుస్తకాలు రాయలేదు ఉపన్యాసాలు చెప్పలేదు. అక్కడకి కొంతమంది మహాత్ములు వచ్చారు, ఆయన చెప్పినవి రికార్డు చేసుకున్నారు. ఆయన జీవితం అంతా చెట్టు తొర్రే. పదహారు సంవత్సరాల పాటు చెట్టు తొర్రలో ఉన్నాడు. ఎన్నో స్తోత్రాలు చెప్పాడు విష్ణువు మీద. చెప్పి చెప్పి ఆఖరున ఈ మాట అన్నాడు. నీ మీద ఇన్ని స్తోత్రాలు

చెప్పాను ఇన్ని భజనలు చేశాను. ఇన్ని కీర్తనలు చేశాను పెరుమాళ్ళూ! నేను సాధన చేసింది నిన్ను తెలుసుకుందామని, అసలు సాధన చేయటానికి ఒకడు ఉంటే కదా! నువ్వు ఉన్నావని నేను లేనని ఇప్పుడే నాకు తెలిసింది అన్నాడు. తమిళనాడులోనే ఇది జరిగింది.

పెరుమాళ్లు అంటే నమ్మాళ్వారికి ఎంత ఇష్టం అంటే మనం రామ, కృష్ణ అని నోటితోటి అనుకోవడం కూడా ఆయనకి ఇష్టం ఉండదు. ఈ నోటితోటి భగవంతుడి నామాన్ని ఎందుకు ఎంగిలి చేస్తున్నారు అనేవారు. ఏమి భక్తో చూడండి! మనం హరే రామ హరే కృష్ణ అనుకుంటాము కదా, అలా అనటం కూడా నమ్మాళ్వారికి ఇష్టం ఉండదు. దేవుణ్ణి మీ పాచి నోట్లో పడేసి అపరిశుభ్రం చేసేస్తున్నారు అనేవాడు. అవి వినలేక తల వంచుకొని, అసలు కీర్తనలు కూడా చేసేవాడు కాదు. భక్తిని ఎంతటి శిఖరాలకి తీసుకెళ్లాడో నమ్మాళ్వారు చూడండి! రామ, కృష్ణ అని కూడా అనేవాడు కాదు. అనకూడదు అని కాదు. మళ్ళీ ఈ అపరిశుద్ధమైన నోటితో భగవంతుని నామం అనటం ఎందుకు అని. ఇదంతా వెర్రితనం కింద మనకు కనిపించవచ్చు. ఆ హృదయంలో ఉన్న ప్రేమ చూడండి ఆ భక్తి చూడండి ఎంత దూరం తీసుకెళ్ళాడో!

మనకున్నది నిజమైన భక్తి అయితే, యదార్థమైన భక్తి అయితే ఆ భక్తిలోనే ముక్తి ఉంటుంది. ఎటువంటి పరిస్థితుల్లో కూడా మీ హృదయాన్ని కాని, మీ మనసుని కాని గందరగోళం పెట్టుకోవద్దు. ఈ శరీరానికి అనారోగ్యం వచ్చినా, మీకు డబ్బు, చదువు తక్కువైనా మీరు నష్టపోయేది ఏమీ లేదు. కాని మాటిమాటికి నీ మనసుని, హృదయాన్ని గందరగోళంలో పెట్టుకుంటే, మళ్ళీ అంత ప్రయత్నం చేసి, సాధన చేసి ఆ గందరగోళాన్ని తగ్గించుకోవాలి. అశాంతిగా ఉన్న మనసు కాని అశాంతిగా ఉన్న హృదయం కాని భగవంతుని వైపు దారి చూపించదు. సాధ్యమైనంత వరకు ఎమోషన్‌కి దూరంగా ఉండండి. చాలామంది ఎమోషన్ డివోషన్ అనుకుంటారు. ఎమోషన్ డివొషన్ కాదు. మీ మనసులో సౌందర్యాన్ని పెంచుకోండి. ఇంతకాలం ఎన్నో వస్తువులు రుచి చూసారు కదా, అలాగే మీ మానసిక జీవితం కూడా ఒకసారి రుచి చూడండి.

భగవంతుడిని ప్రేమించండి. మరింతగా ప్రేమించండి. మరింత మరింత ఎక్కువగా ప్రేమించండి. ఈ లోకంలో గాని, పరలోకంలో గాని, మీ యోగక్షేమాలు భగవంతుడు కంటే ఎక్కువ కోరేవారు లేరు. ఒకవేళ మీరు భగవంతుడిని ప్రేమించటం లేదనుకోండి, ఇప్పుడు నేర్చుకోండి. డబ్బు సంపాదించటం, గౌరవాలు సంపాదించటం, చదువు ఎలా నేర్చుకుంటున్నారో, అదే విధంగా భగవంతుని ప్రేమించటం చేతకాకపోతే నేర్చుకోండి. Love God, always love him, more love him, more and more love him, more and more, more and more love him!

ప్రతి గంట కూడా మీరు భగవంతుని కోసం ఖర్చు పెట్టండి. వంద సంవత్సరాలు, ఎనభై సంవత్సరాలు జీవిస్తున్నారు కదా. ఎన్ని సంవత్సరాలు, ఎన్ని రోజులు ఈశ్వరునికి సమర్పిస్తున్నాము, రోజులో ఎన్ని గంటలు ఈశ్వరునికి ఇస్తున్నాము? ఇరవై నాలుగు గంటల్లో పదహారు గంటలు మనం జాగ్రదావస్థలో ఉంటాం అనుకోండి, అందులో పదహారు నిమిషాలు ఈశ్వరుడికి ఇచ్చి, మిగతా టైం అంతా ప్రకృతిని స్మరిస్తూ ఉంటే అభివృద్ధిలోకి ఏమి వస్తాము? సంపాదన రూపాయి, ఖర్చు మూడు రూపాయలు అయితే, ఇంక నిల్వ ఏముంటుంది? భగవంతుని మోసం చేయటానికి ప్రయత్నం చేయకండి. భగవంతుడు తెలివి తక్కువ వాడు కాదు. నా హృదయంలో ఈ తలంపు ఉందని తలంపు వచ్చే వరకూ నాకు తెలియదు. తలంపు పుట్టక ముందు కూడా నా హృదయంలో ఏ తలంపు ఉందో వాడికి తెలుసు, వాడు ఈశ్వరుడు!

**(మూలం: శ్రీ నాన్నగారి ప్రవచనం – జిన్నూరు, 30 డిసెంబర్ 1984)**



**ఏ చదువైతే మన మనసు యొక్క లోతులని పెంచలేదో, ఏ చదువైతే మన మనసుని విశాలం చేయలేదో అది చదువు కానే కాదు.**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 5 డిసెంబరు 1995, తుని

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఆంజనేయస్వామివారి పేరు తెలియని వారు ఎవ్వరూ ఉండరు. ఆంజనేయస్వామి వారికి రాముడి పనే, ఆయనకి సొంతపని అంటూ ఏమీ లేదు. రాముడి రూపం ధ్యానం చేసుకోవటం, రామనామం స్మరించుకోవడం, రాముడి పని చెయ్యటం తప్ప. నేను, నాది అనేవి రెండూ ఆయనకు లేవు. అసలు సొంత పని అంటూ ఏది లేని వాడు ఆంజనేయస్వామి. ఆంజనేయస్వామి హృదయంలో రాముడిని ఎలా నిలుపుకున్నాడో, మనం కూడా భగవంతుడిని అలా నిలుపుకుంటే, మన మనస్సు పక్వానికి వస్తుంది, మనకి మోక్షసుఖం కలుగుతుంది. మీరు మోక్షం కావాలి అంటే రామచంద్రమూర్తిని స్మరించుకోండి కానీ ఈ లోకానికి సంబంధించిన పనులు ఏమైనా కావాలి అంటే రాముడి దాకా వెళ్ళక్కర్లేదు, నేనే నెరవేరుస్తాను అనేవారట ఆంజనేయస్వామివారు. వేదాలలో ఏ దేవుడు గురించి అయితే చెప్పారో ఆ దేవుడే రాముడిగా వచ్చాడు, వేదముల యొక్క సారం రామాయణంగా వచ్చింది. ఆదికవి వాల్మీకి "మన జీవితంలో కష్టం వస్తూ ఉంటుంది, సుఖం వస్తూ ఉంటుంది. దేహప్రారబ్ధాన్ని బట్టి వాటిని ఎలా ఎదుర్కోవాలో, వికారం లేకుండా శాంతిగా ఎలా జీవించగలగాలో" రామాయణంలో పొందికగా చెప్పాడు.

మానవుడి ప్రవర్తన ఎలా ఉండాలి? ధర్మం ఎలా ఉండాలి? అనేది మనకి రామాయణంలో కనిపిస్తుంది. రామనామం మనల్ని రక్షిస్తుంది. రామనామం లక్ష్మీప్రదమైనది. మనం ఆంజనేయస్వామివారిని ఏ విషయంలో దృష్టిలో పెట్టుకోవాలి అంటే ఆయన రాముడి పనే చేసేవాడు, రాముడినే స్మరించుకునేవాడు, తన హృదయం నిండా రాముడే ఉండేవాడు. ఆంజనేయస్వామి లాగ మనం కూడా భక్తిని కనుక ప్రాక్టీస్ చేస్తే, అంత భక్తిగా మనం

కనుక ఉంటే రామచంద్రమూర్తి మనకి కూడా మోక్షాన్ని ప్రసాదిస్తాడు. రామచంద్రమూర్తి ఎప్పుడూ చాలా నిదానంగా మాట్లాడేవాడు, సమగ్రంగా మాట్లాడేవాడు, తొందరపాటు మాటలు ఉండేవి కావు. అంటే మనిషిలో ప్రతిస్పందన తక్కువ. మనం ఏదైనా వికారం మాటలు మాట్లాడినా ఆయన మాట్లాడే పద్ధతిలో ఆయన మాట్లాడేవారు కానీ మన వికారం మాటలకి ప్రతిస్పందించి మటుకు మాట్లాడేవారు కాదు. అది రాముడిలో ఉన్న ప్రత్యేకత. అందుచేత రామనామం మనల్ని పవిత్రం చేస్తుంది.

మనం సింపుల్‌గా ఉండాలి, సింపుల్‌గా ఉంటే తొందరగా పవిత్రులం అవుతాము. ఎంత నిరాడంబరంగా ఉంటే అంత పవిత్రత మనకి చేకూరుతుంది. దేవుడు కూడా సింపుల్‌గా ఉంటాడు, ప్యూర్‌గా ఉంటాడు. అంటే పవిత్రంగా ఉంటాడు, ఆడంబరం లేకుండా ఉంటాడు. పరమ పవిత్రుడు దేవుడు అంటే! అలా మనం కూడా సింపుల్‌గా, ప్యూర్‌గా ఉండడం అలవాటు చేసుకుంటే, ప్రాక్టీస్ చేస్తే, మనకి కూడా భగవదనుభవం కలుగుతుంది. రాముడు అంటే ఎవరో అనుకోవద్దు ఆత్మే, ఆత్మారాముడు. మనకి బయట కనిపించే రాముడు ఎవడు? దశరథ కుమారుడు రాముడు. ఆ దశరథ కుమారుడు రాముడే మనలో ఆత్మారాముడిగా ఉన్నాడు. మనలో ఉన్న ఆత్మారాముడు వేరు, దశరథ కుమారుడు రాముడు వేరు కాదు. ఆ దశరథ కుమారుడు రాముడిని మీరు ఆరాధించినా, వాడు ఆత్మారాముడి దగ్గరకే తీసుకువచ్చేస్తాడు. ఎందుచేత అంటే ఆత్మారాముడే ఆయన, కానీ దశరథ కుమారుడిగా ఎందుకు అవతరించాడు అంటే, మనం ఎలా ప్రవర్తించాలో, ఎలా మాట్లాడాలో, ఇవన్నీ మనకి నేర్పడం కోసం, అంటే మన మనస్సు యొక్క చాపల్యాన్ని ఎలా ఆపుకోవాలో, మనో నిగ్రహం, ఇంద్రియ నిగ్రహాన్ని ఎలా నేర్చుకోవాలో, జీవితంలో వచ్చే ఒడిదుడుకులని ఎలా తట్టుకోవాలో, మనం ఎలా జీవిస్తే, ఎలా ప్రవర్తిస్తే హృదయంలో ఉన్నటువంటి ఆత్మ తెలియబడుతుందో, అది చూపించటం కోసం ఈ ఆత్మారాముడే, ఈ చైతన్యమే, దశరథుడి కుమారుడిగా అవతరించింది.

మనల్ని మనం ఎలా నిగ్రహించుకోవడం వల్ల, మన మనస్సుని, మన ఇంద్రియాలని, మన ప్రవర్తనని ఎలా నియమించుకోవడం వల్ల మనకి ఆత్మారాముడు దొరుకుతాడో అది దశరథ కుమారుడు రాముడు బయట మనకి చూపించాడు. మనస్సు చేస్తున్న పొరపాటు ఏమిటి అంటే, నీ గురించి నువ్వు ఆలోచించుకో ఇతరుల గొడవ నీకు ఎందుకు అంటే అది వినదు. ఈ మనస్సు దగ్గర చెడ్డ ఎక్కడ ఉందంటే నీకొక క్రమం లేదు, పద్ధతి లేదు, ఎదుటి వాళ్లకి తోకలు ఏమిపెడతావు నువ్వు, నీ గురించి నువ్వు ఆలోచించుకో అంటే అది వినదు. అది ఎంతసేపు వాళ్ళ గురించి, వీళ్ళ గురించి, తోటి వాళ్ళ గురించి చెబుతూ ఉంటుంది. నీ గురించి నువ్వు ఆలోచించుకోమంటే అది ఆలోచించుకోదు. నీ మూలాన్ని నువ్వు చూసుకో అంటే అది చూసుకోదు. ఇతరుల గొడవలు అస్తమాను చెబుతూ ఉంటుంది, ఇదే మాయ. ఇతరులు ఎలా ఉంటే మనకి ఎందుకు? మన ప్రవర్తన మనం సరిగ్గా చూసుకోవాలి. నువ్వు వచ్చాక ఇతరులు వచ్చారు కానీ నువ్వు రాకముందు ఇతరులు రాలేదు. నువ్వు వచ్చాక నీకు ప్రపంచం వచ్చింది, ఇతరులు వచ్చారు. ఇతరులని విచారణ చేసే బదులు నీ మనస్సుని విచారణ చేసుకో నువ్వు, మనసుని విచారణ చేసుకుంటే దాని మూలం దానికి తెలుస్తుంది. దాని మూలం ఎప్పుడైతే నీకు తెలుస్తుందో అప్పుడు దానికి సంబంధించిన నీ హృదయంలో ఉన్నటువంటి చల్లదనం నీకు అందుతుంది. అందుచేత నువ్వు ఇతరులను కాదు విచారణ చెయ్యవలసింది. మనస్సు తనని తాను విచారించుకుంటేనే కానీ అది మూలంలోకి వెళ్ళదు. దాని మూలంలోకి అది వెళితేనే కానీ ఆత్మారాముడు తెలియబడడు. నీ గురించి నువ్వు ఆలోచించుకుని, నీ మనసులో ఏవైనా లోపాలు ఉంటే చూసుకుని, ఆ లోపాలను తొలగించుకుని, నువ్వు బాగుపడడానికి ప్రయత్నం చేసుకో. నువ్వు బాగుపడితే నిన్ను చూసి ఇంకొక పదిమంది బాగుపడతారు అని రామాయణం చెబుతూ వచ్చింది.

అయితే మీరు ఒక విషయంలో కంగారు పడకూడదు. మీలో ఏదైనా లోపం

ఉంది అనుకోండి, ఏదైనా ఒక వాసన ఉంది అనుకోండి, రాముడికి ఎంత సహనం ఉందో, అంత సహనం తోటి, అంత ఓర్పు తోటి కనుక ఆ వాసనని తొలగించుకోవడానికి ప్రయత్నం చేస్తే ఆ వాసన నశిస్తుంది. ఏదో కొంచెం ప్రయత్నం చేసి వాసన ఇంకా నశించటం లేదు ఏమిటి అని అనుకోకూడదు. రామచంద్రమూర్తి ఎంత సహనంగా ఉన్నాడో, ఎంత ఓర్పుగా ఉన్నాడో, అంత సహనం తోటి, అంత ఓర్పు తోటి మనం కనుక సాధన చేస్తే ఆ వాసన నశిస్తుంది. వాసన నశిస్తుందా, నశించదా అనే అనుమానం ఎవరూ పెట్టుకోవద్దు. తప్పనిసరిగా నశిస్తుంది. ఎప్పుడు? మీరు కనుక ప్రాక్టీస్ చేస్తే, వాసనకు అనుగుణంగా వెళ్ళిపోకుండా చేప ఏవిధంగా అయితే నీటికి ఎదురు ఈదుతుందో అలాగ వాసనకి ఎదురు ఈది, వాసనని తొలగించుకోవడానికి మీరు హృదయపూర్వకంగా కనుక ప్రయత్నం చేస్తుంటే అది నశిస్తుంది.

వచ్చే జన్మలు ఉన్నాయా, లేదా అని కంగారు పడకండి, ఉన్నాయి. ఇప్పుడు మనం ఎలా పుట్టామో వచ్చే జన్మలో కూడా అలాగే పుడతాము. ఇప్పుడు కొన్ని కారణాల వల్ల పుట్టవచ్చు, రాబోయే జన్మల్లో కొన్ని కారణాల వల్ల పుట్టవచ్చు. కానీ జ్ఞానం కలిగేవరకు, ఆత్మారాముడు మనకి అనుభవంలోకి వచ్చేవరకు ఈ జన్మ పరంపరలు మటుకు ఆగవు. అంటే ఇప్పుడు ఎలా పుట్టామో, భవిషత్ కాలంలో కూడా అలాగే పుడతాము. ఏ వాసనలు అయితే ఇప్పుడు మనల్ని ఈ జన్మలోకి తీసుకువచ్చాయో, అటువంటి వాసనలే మళ్ళీ మనల్ని జన్మలోకి తీసుకువస్తాయి. భగవంతుడిని ధ్యానించటం, పూజించటం, జపించటం వీటి అన్నిటి యొక్క ప్రయోజనం ఏమిటి అంటే వాసనని నశింపచేయటం కోసం. మనల్ని మనం అణచి ఉంచుకోవాలి. ఎంత అణిగి ఉంటే మనకు అంత మంచిది. ఎంత తక్కువ మాట్లాడితే అంత ఎక్కువ లాభం పొందుతాము. తక్కువ మాట్లాడడం వల్ల కలహాలు తగ్గుతాయి. చాలాచోట్ల కలహాలకి కారణం ఏమిటి అంటే ఎక్కువ మాట్లాడడం. మౌనం కూడా మనం ప్రాక్టీస్ చెయ్యాలి. మౌనం వల్ల కలహాలు తగ్గుతాయి, మౌనం విడిచిపెట్టి

ఎక్కువ మాట్లాడుతూ ఉంటే కలహాలు పెరుగుతూ ఉంటాయి. అందుచేత ఇతరులు ఎలా ఉన్నారు అనేది సమస్య కాదు, రామచంద్రమూర్తి తన జీవితాన్ని ఎలా నియమించుకున్నాడో, మనం కూడా మన జీవితాన్ని అలా నియమించుకోవాలి.

నాలుగు రోజులు మంచం మీద పడుకుంటే ఐదో రోజున చాప మీద మనకు నిద్ర పట్టదు. ఏది అలవాటు అయితే అది. రామచంద్రమూర్తి మహాచక్రవర్తి అయినప్పటికీ, ఆయన అరణ్యవాసానికి వెళ్ళిన మొదటి రోజున చెయ్యి తలకింద పెట్టుకుని నేలమీద నిద్రపోయాడు. ఆయనకి నిద్ర పట్టేసింది. అంటే దానిని బట్టి ఆయన మనస్సు ఆయనకి ఎంత స్వాధీనంలో ఉందో తెలుస్తుంది. వాడు రామచంద్రమూర్తి అంటే! ఏదైనా ఒక పని చేస్తే జ్ఞానికి వాసన పడదు, అజ్ఞానికి వాసన పడుతుంది. అంటే జ్ఞాని సోఫాలో కూర్చున్నా ఒకలాగే ఉంటాడు, కింద నేలమీద కూర్చున్నా ఒకలాగే ఉంటాడు. వాడు దేహమాత్రుడు కాదని వాడికి తెలుసు. రాముడు దేవుడు అంటే రాముడు ఆ దేహంలో ఉన్నప్పుడు కూడా తాను దేహమాత్రుడని కాదని ఆయనకి తెలుస్తూ ఉంటుంది. కానీ మనం ఆ దేహమే దేవుడు అనుకుంటాము. దేహంలో ఉన్నప్పుడు కూడా ఆయన దేహానికి పరిమితం అయ్యి ఉండడు, దేవుడు దేహం ధరించి వస్తే బంధింపబడడు కానీ మనం దేహం ధరిస్తే మటుకు బంధింపపడతాము. ఎందుచేత? ఆ దేహాన్నే కేంద్రంగా పెట్టుకుని, దేహబుద్ధి తోటి మనం పనిచేస్తాం కాబట్టి మళ్ళీ కొత్త వాసనలు వస్తాయి, కొత్త సంస్కారాలు వస్తాయి, పునర్జన్మ హేతువులు వస్తూ ఉంటాయి. బాహ్యంగా ఉన్నటువంటి రాముడి ప్రవర్తన ఎలా ఉందో, మన ప్రవర్తనకూడా అలా తీర్చిదిద్దుకుంటే మనకి ఆత్మారాముడు తెలియబడతాడు.

ఎవరైనా పెద్దలు చెప్పేటప్పుడు మీరు శ్రవణం చెయ్యాలి. శ్రవణం చేస్తే కొంత కాకపోయినా కొంత అయినా అర్థం అవుతుంది. మీ జీవితానికి ఏ మాటలు ఉపయోగమో ఆ మాటలు బ్రెయిన్ లో పెట్టుకోవాలి, మీకు అక్కర్లేని మాటలు అక్కడే వదిలేయాలి. బైబిల్‌లో ఏమన్నాడు అంటే మాట దేవుడై ఉన్నది. దేవుడి పేరు ఎలా తలపెట్టుకుంటున్నారో,

భగవంతుడు చెప్పిన వాక్యాలు కూడా అలా తలపెట్టుకోవడం వల్ల మనస్సు చల్లబడుతుంది. అంటే ఏ వాసన అయితే మనలో ఉందో ఆ వాసనని తొలగించే సంస్కారాన్ని మనం పెంచుకోవాలి. ఎవరికి ఏ రోగం ఉందో, ఆ రోగానికి అనుగుణంగా మందు ఏవిధంగా అయితే వాడతారో, అదే విధంగా మీలో ఏ వాసన ఉందో, ఏ సంస్కారం ఉందో అది చూసుకుని, దానికి వ్యతిరేకమైన వాసనని మీరు పెంచుకుంటూ రావాలి. అంటే ముల్లుని ముల్లు తోటి తీసేసినట్టే. తీసేసిన ముల్లుని జేబులో పెట్టుకోము, బయట పడేస్తాము. అలాగే ఏ వాసన అయితే నువ్వు తొలగించుకోవాలి అనుకుంటున్నావో దానికి వ్యతిరేకం అయిన వాసనని పెట్టుకుని, ఈ వాసన తోటి ఆ వాసన తీసి ఇది కూడా మనం వదిలేయవచ్చు. రెండూ కూడా మనసులోవే కాబట్టి! మీ మనసులో ఉన్న లోపాలు ఏమిటో తెలుసుకుని వాటిని తొలగించుకోవడానికి మీరు కనుక ప్రయత్నం చేస్తే, ఆత్మారాముడు మీకు వ్యక్తం అవుతాడు. అయితే ప్రయత్నం చేసేటప్పుడు ఇది పోతుందా, పోదాఅని అనుమానం అక్కర్లేదు. జాగ్రత్తగా ఓర్పు తోటి చేస్తే, దీక్ష తోటి చేస్తే, చిరకాలం చేస్తే అది నశిస్తుంది.

ఒకే వస్తువు మీద మనసుని నిలబెట్టి ఉంచితే, ఒకే వస్తువుని నిరంతరం చింతిస్తుంటే



**బాహ్యమైన విషయములను చూడటానికి సూర్యుడు కాంతిని ఇస్తున్నాడు. నీ మనస్సులో ఉన్న విషయములు చూడటానికి నీ హృదయములో ఉన్న ఈశ్వరుడు వెలుతురును ఇస్తున్నాడు. ఆయన ఇచ్చే వెలుతురు సహాయముతో మనస్సులోని గొడవలను చూస్తూ ఆయనే లేదు అంటున్నాము!**

దానిని ధ్యానం అంటారు.  ధ్యానం చేసేవాడు ఎవడు అని చూడటం దానిని విచారణ అంటారు.  Self-enquiry గమ్యం కాదు కానీ self-enquiry ఎందుకు అంటే self-realization కలుగుతుంది.  అంటే ఎవడైతే enquiry చేస్తాడో, enquiry చేసి, చేసి వాడే నశిస్తాడు. Enquiry జడం చెయ్యదు, చైతన్యం కూడా చెయ్యదు.  అంటే ఏదైతే మనకి ఇప్పుడు నేనుగా వ్యక్తం అవుతోందో, అదే enquiry మనకి చేసి పెడుతుంది.  దానినే మనం enquiry చెయ్యడానికి ప్రోత్సాహం చెయ్యాలి.  ఏదైతే మనకి నేనుగా వ్యక్తం అవుతోందో అది నిజం కాదు. అయితే ఇందులో చిక్కు ఎక్కడ వస్తుందంటే, మామూలుగా నీటిలో కెరటాలు ఎలా వస్తాయో, అలా మనసులో రోజూ ఉదయం లేచింది మొదలు సాయంత్రం పడుకునేవరకు కెరటాలు వస్తూ ఉంటాయి.  ఒకొక్కసారి కోపం వస్తుంది, అదొక కెరటం.  ఇది బాగా అర్థం చేసుకోండి.  కెరటం వేరు, నీరు వేరు కాదు, ఆ నీరే కెరటం కింద మారుతుంది.  అలాగే మీ మనస్సు ఒకొక్కసారి కోపం కింద మారుతుంది, ఒకొక్కసారి చిరాకు కింద మారుతుంది. వాళ్లకి నష్టం వచ్చే పని వాళ్ళే చేసుకుంటూ ఉంటారు ఒకొక్కసారి.  ఎందుచేత అలా చేసుకుంటారు అంటే, ఆ టైములో మనస్సు కండిషన్ లో ఉండదు.  ఏదో కెరటం వస్తుంది, ఆ కెరటం వచ్చినప్పుడు ఆ కెరటానికి లోబడిపోతాం.  ఇంతకీ మనం గ్రహించవలసింది ఏమిటంటే, నీరే కెరటం కింద ఏ విధంగా అయితే మారుతుందో, మన మనస్సే చిరాకుగా, కోపంగా, తాపంగా, ఇష్టంగా, అయిష్టంగా, లేకపోతే కామంగా మారుతంది.  ఇవి కెరటాలు అన్నమాట, నీరే కెరటాలు కింద ఎలా మారుతుందో, మన మనస్సే ఇలా మారుతుంది.  ఆ కెరటాల యొక్క వేగం తగ్గాలి, ఆ కెరటాల యొక్క వేగం తగ్గడానికే ధ్యానం చెయ్యడం. మనస్సుని నువ్వు ఎవరు అని అడగడం విచారణ పద్ధతి.

మనకి మనస్సు ఉంది, ఆ మనస్సుని నువ్వు ఎవరవు?  ఎక్కడ నుంచి వచ్చావు? అని ఆ మనస్సుని అడగడం.  మనస్సులో మనకి ఏమైనా ఇబ్బందులు వస్తే, ఎందుకు నీకు ఇవన్నీ వస్తున్నాయి?  ఆ మనస్సుని నువ్వు ఎవరవు?  ఎంతకాలం నుంచి నన్ను పట్టుకుని

పీడించేస్తున్నావు నువ్వు? ఎంతకాలం నుంచి పట్టుకుని శ్రమ పెట్టేస్తున్నావు నువ్వు? నీకు, నాకు సంబంధం ఏమిటి? నువ్వు ఎక్కడ నుంచి వచ్చావు? అని మన మనస్సుని ప్రశ్నించటం. కొంతమంది అంటూ ఉంటారు చూడండి వీడు పీడించేస్తున్నాడురా మమ్మల్ని అని, అలాగే మనస్సు మనల్ని కూడా పీడిస్తూ ఉంటుంది. ఎంతకాలం ఇలా పీడిస్తావు? ఇప్పటికైనా నాకు దారి ఇవ్వాలి నువ్వు అని అడిగి, నువ్వు దారి ఇస్తేనే కానీ నీ మూలం నాకు తెలియదు అని ఆ మనస్సుని నువ్వు ఎవరు? అని ప్రశ్నించడం విచారణ. విచారణ చేస్తే అది నశిస్తుంది. అలా కాకుండా ఒక దేవుడు మీద మీ మనస్సుని పెట్టి నిరంతరం ఏక వస్తువుని చింతించడం వల్ల, దేవతాపురుషుడిని చింతించడం వల్ల కూడా మనస్సు నశిస్తుంది. అలా అయినా చేసుకోవచ్చు, ఇలా అయినా చేసుకోవచ్చు. కానీ గమ్యం ఏమిటి? మనసు నశించాలి. విచారణ వల్ల, ధ్యానం వల్ల మనస్సు తన మూలంలోకి వెళుతుంది. అంటే ఎక్కడనుంచైతే ఉదయిస్తుందో, అక్కడకి ఉపసంహరించబడుతుంది ధ్యానం వల్ల, విచారణ వల్ల! అది ఏ స్థలంలో అయితే ఉదయిస్తుందో, ఆ స్థలంలోకి వెళ్ళాక అది నశిస్తుంది.

శరణాగతిమార్గం ఏమిటి అంటే, మనస్సుని భగవంతుడికి అర్పించడమే. ఈ మనస్సుని భగవంతుడికి సమర్పించడం, దానినే శరణాగతిమార్గం అని పిలుస్తారు. అంటే తనని తాను అర్పించుకోవడం. తనని తాను అర్పించుకోవడం వల్ల ఏదైతే తాను అనుకుంటున్నాడో, మనస్సుని ఇప్పుడు మనం నేను అనుకుంటున్నాం కదా, దానిని భగవంతుడికి అర్పించడం వల్ల భగవంతుడి స్వరూపం మనకి ఇస్తాడు. భక్తి మనకి ఇంద్రియ నిగ్రహానికి సహాయం చేస్తుంది. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మనో నిగ్రహానికి, ఇంద్రియ నిగ్రహానికి మనకి భక్తి సహాయం చేస్తుంది. భక్తి, జ్ఞానం వేరు కాదని చెప్పారు. రమణమహర్షి గారు "తల్లి లేకుండా పిల్లవాడు బయటకి వస్తాడా" అన్నారు. అలాగే భక్తి లేకుండా జ్ఞానం రాదు అన్నారు. రమణమహర్షి గారు భక్తి గురించి ఏమన్నారు అంటే, జ్ఞానమాత అన్నారు. అంటే భక్తి వల్ల మనిషి సంస్కరింపబడతాడు. భక్తి అంటే ఏమిటి?

ప్రేమ. మనకి ఎదుటి మనిషి మీద ప్రేమ కనుక ఉంటే, వాడిలో ఉన్న దోషాలు మనకు కనపడవు. ఎదుటి మనిషి మీద ప్రేమ లేనప్పుడు వాడిలో ఉన్న దోషాలు కనిపిస్తాయి. ఇది బాగా జ్ఞాపకం పెట్టుకోండి. మీ అబ్బాయిలో ఏవైనా దోషాలు ఉన్నాయి అనుకోండి మీకు కనపడవు. కానీ ఊళ్ళో వ్యక్తులలో దోషాలు ఉంటే అవి మటుకు అందరికీ కనిపిస్తాయి. అంటే ఏమిటి? మనకి ఎవరి మీద అయితే ప్రేమ ఉందో వారిలో ఉన్న దోషాలు కనపడవు. ఎవరి దోషాలు అయినా మనకి ఎక్కువ కనిపిస్తున్నాయి అంటే వారి మీద మనకి ప్రేమ లేదు అని అర్థం.

భగవంతుడి మీద కనుక నీకు ప్రేమ ఉంటే అది భక్తి అన్నారు. ఆర్థికంగా కానీ, ఇతర విషయాలలో కానీ, మీకంటే కొంచెం ఎక్కువ ఇబ్బంది పడేవాళ్ళని చూసి మీకు జాలి కలుగుతోంది అనుకోండి అదీ ప్రేమే, దానిని దయ అన్నారు. ప్రేమ లేకుండా భక్తి కలగదు. ప్రేమ అనేది వ్యాపారం చేయదు. కామం అడుగుతుంది కానీ ప్రేమ మటుకు ఏమీ అడగదు. ప్రేమకి ఇవ్వడమే కానీ అడగడం అనేది ఉండదు. ఎవడికైతే ప్రేమ హృదయం ఉందో, వాడు ప్రేమిస్తాడు కానీ కామించడు. మనవాళ్ళు ఏమని చెబుతారు అంటే భగవంతుడు ప్రేమ అని చెప్పే బదులు ప్రేమే భగవంతుడు అని చెప్పడం మంచిది అని. అంటే భగవంతుడు ప్రేమ స్వరూపుడు. మన పట్ల ఆయనకి ప్రేమ ఉంది కాబట్టే ఆయన ధ్యానం కుదురుతుంది. భగవంతుడి యొక్క పాదాల యందుమనకి కనుక ప్రేమ కలిగి ఉంటే, ధ్యానం కుదురుతుంది, స్మరణ కుదురుతుంది.

సర్వసాధారణంగా చాలా మందికి ధ్యానం చెయ్యడం కష్టం. భగవంతుడి యందు మనకి ప్రేమ లేకుండా, భగవంతుడిని మనం ధ్యానం చెయ్యలేము. ఒకవేళ చేసినా అది అంటించుకున్నట్టే ఉంటుంది. పంచదారలేని కాఫీ ఎలా ఉంటుందో, ప్రేమ లేకుండా చేసే ధ్యానం కూడా అలాగే ఉంటుంది. ప్రేమించేవాడే ధ్యానించగలడు. పరమేశ్వరుడి పట్ల ప్రేమ కుదరకపోతే వాడికి ధ్యానం కూడా కుదరదు. మనస్సు ఎప్పుడైతే భగవంతుడిని

ప్రేమిస్తుందో, ఆ ప్రేమించడంలోనే అది కరిగిపోతుంది. సాధన అంటే ప్రయత్నం. భగవదనుభవం పొందడానికి ఏ విషయాలు అయితే మనకి అడ్డు వస్తున్నాయో, ఆ విషయాలు తొలగించుకోవడం కోసం మనం చేసే ప్రయత్నమే సాధన అని అంటారు. ఏ దేవుడిని అయితే మీరు పూజిస్తున్నారో, ఆ దేవుడు మీకు ఆత్మను పట్టి ఇవ్వడు, మీరు ఆత్మ అయ్యి ఉన్నారు. మీరే ఆత్మ అయి ఉండగా ఇంక ఆయన మీకు ఇవ్వడం ఏమిటి? మీరు ఆత్మ అయినప్పటికీ మీకు దేహం తెలుస్తోంది, మీ అహంభావన తెలుస్తోంది కానీ ఆత్మ తెలియటం లేదు. మీరు ఆత్మే కానీ ఆత్మ అనే విషయం మీకు తెలియటం లేదు. ఏ కారణాల వల్ల మీరు ఆత్మ అన్న సంగతి మీకు తెలియటం లేదో, ఆ కారణాన్ని తొలగించడానికి ప్రయత్నం చేస్తాడు, వాడే దేవుడు. అందుకే మనం దేవుడిని ప్రేమించటం. దేవుడిని మనం ప్రేమించగా, ప్రేమించగా, మన హృదయంలో ఉన్న దేవుడు మనకి వ్యక్తం అవ్వడం కోసం అడ్డు వచ్చే విషయాలను ఆయనే తొలగిస్తాడు. మనకి భగవదనుభవం పొందడానికి అడ్డు వచ్చే అడవిని అంతా కూడా నరుక్కుని వస్తాడు. అది దేవుడు చేసే పని.

మన మనస్సు ఎక్కువ దూరం ప్రయాణం చెయ్యలేదు. అంటే దేవుడిని తెలుసుకోవడానికి మనం ప్రయత్నం చేసేటప్పుడు, ఆ ప్రయత్నం ఎప్పుడైతే మొదలు పెట్టామో, మనం వెళ్ళే దూరం తక్కువ ఉంటుంది, ఆయన వచ్చే దూరం ఎక్కువ ఉంటుంది. ఇది బాగా గ్రహించండి. మీరు ధ్యానం చేసినా వీటి అన్నిటికంటే దేవుడి అనుగ్రహం ముఖ్యమైనది అంటున్నారు రమణమహర్షి. అంటే ఆత్మ అన్నా, గురువు అన్నా, దేవుడు అన్నా ఒక్కటే. మీరు ఏదైనా సాధన ప్రారంభించి కొంతదూరం వెళితే, మిమ్మల్ని కలుసుకోవడానికి దేవుడే ఎక్కువ దూరం వస్తాడు. మీరు నడిచే దూరం తక్కువ ఉంటుంది. మీలో ఉన్న ప్రేమ వల్ల కరిగిపోయి దేవుడే ఎక్కువ దూరం వస్తాడు. ఈ విషయం మీకు తెలియకపోయినా జరిగేది అదే. భగవంతుడిని తెలుసుకోవాలి, భగవంతుడిలో ఐక్యం అవ్వాలి అనేటటువంటి సాధన కనుక, ప్రయత్నం కనుక మీరు చేస్తే, భగవంతుడి వైపు మీరు చేసే ప్రయాణం కంటే

భగవంతుడే ఎక్కువ దూరం ప్రయాణం చేసి వచ్చి మిమ్మల్ని ఆయనలో ఐక్యం చేసుకుంటాడు అంటున్నారు. కానీ మనకి ఏమి అనిపిస్తుంది అంటే మనమే ఎక్కువ దూరం వెళ్ళిపోతున్నాం అని అనుకుంటాం. మీరు ఎక్కువ దూరం వెళ్ళడం లేదు, ఆయనే ఎక్కువ దూరం వచ్చేస్తున్నాడు. దేవుడి అనుగ్రహం ముఖ్యం. మీ ప్రేమలో sincerity కనుక ఉంటే, మీ సాధనలో కనుక sincerity ఉంటే, మీరు చేసే బాహ్య ప్రయత్నాలు కంటే కూడా నీ హృదయంలో కనుక sincerity ఉంటే, ఆయన నిన్ను అమితంగా, పరిమితులు లేకుండా ప్రేమించి, నిన్ను ఆయనలో ఐక్యం చేసుకుంటాడు. ఏదో లాంఛనం కోసం చేసే పూజ కంటే, జపం కంటే, ధ్యానం కంటే, అంటే నువ్వు యాంత్రికంగా చేసే పనులు కంటే, నీ మనసిచ్చి, హృదయం ఇచ్చి భగవంతుడిని కనుక ప్రేమిస్తుంటే, భగవంతుడికి నీ యందు ప్రేమ కలిగి, ఆయనలో నిన్ను ఐక్యం చేసుకుంటాడు. దీని అర్థం ఏమిటి అంటే, నువ్వు చేసే సాధన కంటే నీ పట్ల ఆయనకి ఉన్న ప్రేమే ఎక్కువ సహాయకారిగా ఉంటుంది, ఆయనలో ఐక్యం అవ్వడానికి నీకు ఎక్కువ అవకాశం ఉంటుంది. నీ సాధన వల్లే నువ్వు ఒడ్డుకు రాలేవు. నీ సాధన ఊరికే నిమిత్త మాత్రమే. ఎప్పుడైనా భగవదనుభవం నీకు కలిగితే నీ తెలివితేటల వల్లే కలిగింది అనుకోకు, భగవంతుడి అనుగ్రహం వల్లే కలిగింది అనుకో, ఆయన అనుగ్రహం వల్ల ఆయన తెలియబడతాడు కానీ కేవలం నీ ప్రయత్నం వల్ల తెలియబడడు. అలాగని నీ ప్రయత్నం వద్దని కాదు, నీ ప్రయత్నం తగు మాత్రమే అని చెబుతున్నారు.

**కొంతమంది ఉపవాసాలు చెయ్యమంటే చేస్తారు కాని దుష్ట సహవాసాలు విడిచిపెట్టమంటే విడిచిపెట్టరు.దీనికి ధైర్యం ఉండాలి . దుష్ట సహవాసాన్ని ఎంత తొందరగా వదిలేస్తే, అంత తొందరగా వాడు ఆత్మ సన్నిధానంలోకి వెళ్తాడు.**



మనిషిని పీడించేది వాసన. కోపం ఒక వాసన, చిరాకు ఒక వాసన, ద్వేషం ఒక వాసన. ఒక మనిషికి కోపం వస్తుంది, ఒక మనిషికి అసూయ వస్తుంది, ఒక మనిషికి చిరాకు వస్తుంది, ఒక మనిషి రజోగుణంలో ఉంటాడు. ఇవన్నీ చూసి మీరేమి కంగారు పడకండి. ఆ మనిషి మీద మీరు ద్వేషం పెట్టుకోవద్దు. ఆ మనిషిలో ఉన్న వాసన అటువంటిది. ఏమిటండి వాడు అలా మాట్లాడుతున్నాడు అని భగవాన్‌ని ఎవరైనా అడిగితే, ఏమి చేస్తాం మరి వాసన అత్యంత బలీయమైనది అనేవారు. మనం అయితే కోపం తెచ్చుకుంటాం. ఎవరికైనా దగ్గర కూర్చొబెట్టుకుని నెమ్మదిగా చంటిపిల్లవాడికి చెప్పినట్టు కొన్ని విషయాలు చెప్పేవారు భగవాన్. అంత జాగ్రత్తగా కూర్చొబెట్టుకుని చెప్పినా కొంతమందికి అర్థం అయ్యేది కాదు. అర్థం కాకపోతే మనం ఏమి చేస్తాం? ఎంత బాగా చెప్పినా మీకు అర్థం అవ్వటం లేదని మనం వారిని తిడతాం. మీరు బాగానే చెబుతున్నారు, చెప్పినా వాళ్లకి అర్థం అవ్వటం లేదని భగవాన్‌తో పక్కవాళ్ళు అంటే, ఏమి చేస్తాం మరి వాసన అత్యంత బలీయమైనది, వాడిలో ఉన్న వాసన మనం చెప్పిన మాటలు వాడికి అర్థం అవ్వనివ్వటం లేదు. పాపం వాడేమి చేస్తాడు అనేవారు. వాడిలో ఉన్న వాసన, ఆ లోక వాసన, ఆ దేహ వాసన, మనం చెప్పినా వాడికి అర్థం అవ్వనివ్వటం లేదు. వాడేమి చేస్తాడు? మన మంచి మాట వాడి బుర్రకి ఎక్కడం లేదు. కారణం ఏమిటి? వాసన అంత బలీయంగా ఉన్నది ఏమి చేస్తాం మనం అనేవారు. అలా పైకి అనేవారు కానీ లోపల వాసన తగ్గించడానికి ప్రయత్నం చేసేవారు అదే అనుగ్రహం. ఈ వాసన ఏమి చేస్తుంది అంటే దానిని రిపీట్ చేసేకొలది అది పెరుగుతూ ఉంటుంది. అంటే మనం వాసన రిపీట్ చేస్తున్నాం అనుకోండి అది పెరుగుతూ ఉంటుంది. Repetition కనుక తగ్గిస్తే ఆ వాసన పల్చబడిపోతుంది.

రాముడిని చూసి మనం నేర్చుకోవాల్సింది ఏమిటి అంటే, భూమికి ఎంత సహనం ఉందో రాముడికి కూడా అంత సహనం ఉండేది. ఎప్పుడూ ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి.

శరీరం ప్రారబ్ధం అనుభవించడానికి వచ్చింది, దానిని పూర్తి అవ్వనివ్వాలి. ఈలోపులో మనం కంగారు పడకూడదు. కంగారు పడి చచ్చిపోతాం అనుకోండి ఏ పిశాచి జన్మలో వస్తాయి. మనం తొందరగా చచ్చిపోవాలి అని అనుకోకూడదు, ఒక వెయ్యి సంవత్సరాలు ఉండాలని అనుకోకూడదు. దేహాన్ని ప్రారబ్దానికి వదిలేయండి. మిమ్మల్ని ఊరేగించవలసి ఉంటే ఊరేగిస్తారు, మీరు మొట్టికాయలు తినవలసి ఉంటే మొట్టికాయలు తింటారు. ఏదో ఒకటి జరగనివ్వండి. ఆ ఊరేగించడం నిజం కాదు, ఈ మొట్టికాయలు తినడం నిజం కాదు. అదేదో జరగనివ్వండి, ఈ శవాన్ని పూజిస్తారో, అందరూ తిడతారో ఏదో ఒకటి జరుగుతుంది ప్రారబ్ధాన్ని బట్టి, ఆ ప్రారబ్ధం అనుభవించేయండి దాని పీడ వదిలిపోతుంది అన్నారు. మనకి ఏదైనా రోగం ఉంది అనుకోండి, ఆ రోగం తగ్గిపోవటం మంచిదా, అలాగే ఉండటం మంచిదా? తగ్గిపోవటం మంచిది. అలాగే ప్రారబ్ధం పోవటం మంచిది. ఆ ప్రారబ్ధం మీరు అనుభవించలేక మీరు కంగారుపడి చచ్చిపోతారు అనుకోండి మాటవరసకి ఆ ప్రారబ్ధం ఎలాగూ పోదు, మళ్ళీ వచ్చే జన్మలో ఆ ప్రారబ్ధం అనుభవించాలి. ఈ లోపులో మనకి ఏ పిశాచి జన్మో వస్తుంది.

కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే ఓ అర్జునా నీకు ఇష్టం ఉన్నా నువ్వు యుద్ధం చెయ్యాలి, నీకు ఇష్టం లేకపోయినా చెయ్యాలి. ఈ చేసేపని ప్రీతిగా, ఇష్టంగా చేసేయ్ అని చెపుతూ ఇక్కడ ఒక చక్కటి మాట చెప్పారు. నీ దేహప్రారబ్దంలో నువ్వు యుద్ధం చెయ్యవలసి ఉంది, అందుచేత చెయ్యి. ఆ చేసేది నువ్వు ఇష్టంగాను, ప్రీతిగాను చెయ్యి, ప్రేమగా చెయ్యి. అలా చేస్తే నీకు కొత్త వాసనలు రావు, పాత వాసనలు అన్నీ పోతాయి అన్నారు. అంటే మన ప్రారబ్ధాన్ని మనం ఇష్టంగా అనుభవిస్తే కొత్త వాసనలు రావు, పాత వాసనలు అన్నీ పోతాయి. అంటే పునర్జన్మకి ఏవైతే కారణాలు ఉన్నాయో అవన్నీ ఈ శరీరం ఉండగానే నశించిపోతాయి. కొత్త వాసనలు వచ్చి వీటికి కలవవు. ఒకవేళ నీకు పని చేయటం ఇష్టం లేకపోయినా నీ చేత బలవంతంగా చేయిస్తుంది.

కొంతమంది అత్తగారిని చూడటం చూస్తూ ఉంటారు, మూలుక్కుంటూ ఉంటారు. మీకు అర్థం అవుతోందా? టైంకి కాఫీ ఇస్తూ ఉంటారు, అన్నం పెడుతూ ఉంటారు కానీ మూలుక్కుంటూ ఉంటారు. అలా చేస్తూ ఉంటే దేహానికి పని తప్పదు, మనసు పాడైపోతుంది, అందుచేత అలా ఉండవద్దు అన్నాడు కృష్ణుడు అది గీతాసారం. అందుచేత నీ ప్రారబ్ధంలో ఎవరిని చూడవలసి ఉంటే వాళ్ళని ప్రేమగా చూడు. అక్కడితోటి నీకు పాత వాసనలు అన్నీ పోతాయి, కొత్త వాసనలు రావు. చూడటమే ఇష్టం లేకుండా చూస్తావు అనుకో, పాత వాసనలు పోవు, కొత్త వాసనలు వచ్చి కలుస్తాయి. ఈ విషయం నువ్వు అర్థం చేసుకుని పని చెయ్యి అన్నారు. కృష్ణుడు చెప్పిన ఈ మాట నాకు బాగా ఇష్టం. అంటే ఏమిటి? మనం చేసే పని ప్రీతిగా కనుక చేస్తే దేవుడి అనుగ్రహానికి మనం పాత్రులం అవుతాం.

కొంతమంది మనుషులకి సేవ చేసినా పాపం గుర్తింపు ఉండదు, ఇన్ని రకాలుగా వారు మనకి సహకరిస్తున్నారు అని అసలు గుర్తింపే ఉండదు. కృష్ణుడు ఏమని చెబుతున్నాడు అంటే వాడు గుర్తిస్తాడు, గుర్తించడు వాళ్ళ గొడవ నీకు ఎందుకు? వాళ్ళ హృదయంలో నేను ఉన్నాను కదా, నువ్వు చేసే సేవను నేను గుర్తిస్తాను కదా, నీకు మోక్షం ఇచ్చేవాడిని నేను కదా, ఆ మనుషుల గొడవ నీకు ఎందుకు అంటున్నాడు. అందుచేత ఆ మనుషులు గుర్తించకపోయినా వారికి ఆధారంగా ఉన్న నేను నిన్ను గుర్తిస్తున్నాను కదా, నీకు మోక్షం ఇచ్చేవాడిని నేను. మిగతా గొడవ నీకు ఎందుకు అంటున్నారు. కొంతమంది ఎంత సేవ చేసినా చెయ్యలేదనే చెబుతూ ఉంటారు. ఇంక వాళ్ళ గొడవ వదిలేయమన్నాడు కృష్ణుడు. వాళ్ళ నోరు మనం కట్టలేము. మీరు ఇంట్లో వాళ్ళని ఎంత ప్రేమగా చూసినా, పొరుగింటి వాళ్ళు వస్తే మమ్మల్ని ఇంట్లో ఎవరు చూడడం లేదు అని చెబుతారు. ఈ రకమైన జనాలని వదిలేయవయ్యా నువ్వు అంటున్నాడు. వాళ్ళ గొడవ నీకు ఎందుకు? వాళ్ళ హృదయంలో నేను ఉన్నాను కదా, నేను కదా గుర్తించి నీకు మోక్షం ఇచ్చినా, జ్ఞానం ఇచ్చినా, రాబోయే జన్మ మంచి జన్మ ఇచ్చినా, చేసేవాడిని నేను కదా, ఎక్కడ ఏ కుటుంబంలో నీకు జన్మను

ప్రసాదించాలో, అదంతా చేసేవాడిని చైతన్య స్వరూపుడిని నేను కదా, ఆ మనుషుల గొడవ నీకు ఎందుకు? వాడు గుర్తిస్తే ఏమిటి, గుర్తించకపోతే ఏమిటి? ఆ మనుషులు రోజుకి ఒకరకంగా ఉంటారు, వాళ్ళ గొడవ నీకు ఎందుకు? నన్ను చూసి నువ్వు పని చెయ్యి అంటున్నారు. మీకు అర్థం అవుతోందా? లోపల ఉన్న పరమేశ్వరుడిని దృష్టిలో పెట్టుకుని పని చెయ్యమంటున్నాడు. ఇంక వీళ్ళ గొడవ నీకు ఎందుకు అంటున్నాడు. ఆయన మీద మీకు ఎంత ప్రేమ ఉందో, ఆ ప్రేమ తోటి ఆయనని చూడండి, లోపల ఉండేవాడిని నేను, గుర్తించేవాడిని నేను, చూసేవాడిని నేను, మీకు ఫలితం ఇచ్చేవాడిని నేను, ఆ శవం ఇవ్వదు మీకు ఫలితం. మీకు బహుమానం ఇచ్చి, మిమ్మల్ని సత్కరించి, మిమ్మల్ని అలంకరించేవాడిని నేను. నేను ఉండగా మీకు ఎందుకు ఈ మనుషుల గొడవలు అంటున్నాడు. అంటే జీవుడు గుర్తిస్తే ఏమిటి, గుర్తించకపోతే ఏమిటి, నేను కదా మీకు ఫలితం ఇచ్చేవాడిని, కర్మఫలం ఇచ్చేవాడిని నేను కదా. అదే కర్తురాజ్ఞయాప్రాప్యతే ఫలం. కర్త ఎవడు? ఈశ్వరుడే. అంటే మీరు చేసే పనిని బట్టే ఫలితం వచ్చేయదు. ఆయన ఆజ్ఞను బట్టి వస్తుంది.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః ।**
**వశే హి యస్యేన్ద్రియాణి తస్య ప్రజ్ఞా ప్రతిష్ఠితా ॥ 2-61 ॥**

**తాత్పర్యము:** సాధకుడు ఆ ఇంద్రియములను అన్నిటినీ వశమునందు ఉంచుకొని, సమాహిత చిత్తుడై (చిత్తమును పరమాత్మ యందు లగ్నము చేసిన వాడై) మత్పరాయణుడై, ధ్యానమునందు కూర్చొనవలెను. ఏలనన, ఇంద్రియములను వశమునందు ఉంచుకొనువాని బుద్ధి స్థిరముగా ఉండును.

ఎవడైతే బలమైన ఇంద్రియాలని తన స్వాధీనంలో పెట్టుకుంటున్నాడో, ఎవడైతే నన్నే పొందాలి అని, నన్నేగమ్యంగా, లక్ష్యంగా పెట్టుకుంటున్నాడో, ఎవడైతే మనసులో నిలకడగా, కుదురుగా ఉంటాడో, వాడికే ఇంద్రియాలు భయపడతాయి. మీ మనసుని మీరు కంగారు పెట్టుకోకూడదు. మీరు నిలకడగా, కుదురుగా, బహుజాగ్రత్తగా ఉండాలి. లాభం వచ్చినప్పుడు ఒకరకంగా, నష్టం వచ్చినప్పుడు ఒకరకంగా ఉండకుండా, ఏకాగ్రంగా మీ మనసుని నిలబెట్టుకోవాలి. మీ ఇంద్రియాలు మీకు స్వాధీనం అవ్వాలంటే, మీ మనసుని కుదురుగా ఉంచుకొని  నన్ను లక్ష్యంగా పెట్టుకొని నన్నే పొందాలి.

మన అందరికి భక్తి ఉంది, భగవంతుడిని ప్రార్థిస్తున్నాం అందులో అనుమానం

లేదు. భగవంతుడిని పొందటం కోసమే కనుక మీరు పూజలు చేస్తే, మీ ఇంద్రియాలు మీ స్వాధీనంలోకి వస్తాయి. మీ లక్ష్యం గనుక ఈ లోకంలో గొడవలు అయితే మీ ఇంద్రియాలు మీ స్వాధీనంలోకి రావు. మీరు పూజ, జపం, నామం, తపస్సు,ఏది చేసినా,మీ లక్ష్యం భగవంతుడు అవ్వాలి. కాని ఈ లోకంలో మనం అనుకున్న పనులు నెరవేరాలి అని భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. భగవంతుడు చెప్పే ఈ ఒక్క విషయం మీరు బాగా అర్థం చేసుకోండి. ఎవరికి ఇంద్రియాలు స్వాధీనంలోకి వస్తాయి అంటే, పూజలు, వ్రతాలు, జపం చేసేటప్పుడు కూడా భగవంతుడినే పొందాలి,నాకు భగవంతుడు తప్పించి ఏమీ అక్కరలేదు,అని మీ మనస్సు నిండా భగవంతుడిని పెట్టుకుంటే అప్పుడు ఇంద్రియాలు స్వాధీనంలోనికి వస్తాయి.

కోరికలు, వాసనలు, కాంక్షలు, ఆకాంక్షలు అనేవి లేని స్థితిలో ఉండటం మంచిది. ఒకవేళ కోరిక లేకుండా నువ్వు ఉండలేకపోతే మంచిని కోరుకో అంటున్నారు రమణభగవాన్. నూటికి నూరు మార్కులు రానప్పుడు పాస్ మార్కులు అయినా తెచ్చుకో అంటున్నారు. ఇందులో రహస్యం ఉంది. జీవుడు తల్లి కడుపులోంచి బయటకి రాగానే మోహం వాడి మనస్సుని, ఇంద్రియాలని, బుద్ధిని బలవంతంగా ఆక్రమించుకుంటుంది. ఒక దేశం యొక్క రాజు ఇంకో దేశాన్ని ఆక్రమించుకున్నట్టే, ఈ మోహం వచ్చి ఆక్రమించుకుంటుంది. మిమ్మల్ని జైలులో పెట్టారు అనుకోండి,ఎవరైతే పెట్టారో వాళ్ళు విడిచి పెడితే బయటికి రాగలం, లేకపోతే రాలేము కదా. ఈ మోహం ఆక్రమించుకున్న తరువాత ఇంక స్మశానంలోకి వెళ్ళే వరకూ పోదు. మీరు చాలా మంచి పనులు చేస్తున్నారు, గుళ్ళు గోపురాలు కట్టిస్తున్నారు, చెరువులు తవ్వించారు, వ్రతాలు జపాలు చేస్తున్నారు, అయితే లోకం యొక్క వాసనలతోటి మంచి పనులు చేసినప్పటికీ అది మోహానికి సంబంధించినదే! మోహం యొక్క ప్రేరణ మీదే మనం ఏపనైనా చేస్తున్నాం. దానివలన పుణ్యం రావచ్చు కాని జ్ఞానం మటుకి రాదు, మోక్షం మటుకి రాదు. మోహంలో ఉన్న నీ బుద్ధిని, ఇంద్రియాలని నేను విడుదల చెయ్యాలి అంటే, నన్ను లక్ష్యంగా పెట్టుకుని, నన్ను సాధనగా పెట్టుకుని, నీ గురి నాయందు పెట్టుకుని నువ్వు నిలకడగా, కుదురుగా ఉంటే, ఆ మోహం నుండి నిన్ను విడిపిస్తాను, అప్పుడు నీకు జ్ఞానం కలుగుతుంది అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

భగవంతుడు ఎంత అపూర్వంగా చెబుతున్నాడో విని మీ మనసుకి పట్టించుకోండి. మనమందరం జ్ఞానం యొక్క ఆక్రమణలో లేము. మోహం యొక్క ఆక్రమణలో ఉన్నాం. ఇప్పుడు ఏడుస్తూ కూర్చుంటే లాభం లేదు. కాలం వృధా అవుతుంది. గతించిపోయిన రోజులు రమ్మంటే రావు. మిమ్మల్ని అందరిని మోహం ఆక్రమించింది. మీ అంతట మీరు దానిని విడదీసుకోలేరు. మీరు పూజ, జపం, నామం చేస్తున్నారు, నన్ను అలంకరిస్తున్నారు, అన్నీ బాగానే చేస్తున్నారు. కానీ మీ లక్ష్యం మోహం. అలా చేస్తే మీకు పుణ్యం వస్తుంది. మీరు నన్ను లక్ష్యంగా పెట్టుకోండి, నన్ను పొందటానికే మీరు ప్రయత్నం చెయ్యండి. మిగతా గొడవలు మీరు పెట్టుకోకండి. అది మీ దేహ ప్రారబ్ధాన్ని బట్టి జరుగుతూ ఉంటుంది. నన్ను పొందటం కోసమే మీరు ఏ పనైనా చెయ్యండి. మీ మనస్సు, దేహం, ఇంద్రియాలు, ధనాన్ని, సమస్తం నాకే అర్పించండి. ఇది అంతా భగవంతుడి శక్తే అనే భావన తోటి పని చేయండి. . సాధన కూడా భగవంతుడి కోసమే చేయండి. సర్వ కాల సర్వ అవస్థల యందు కూడా భగవంతుడినే పొందాలి అని లక్ష్యంగా పెట్టుకుంటే, మోహంలో పడి కొట్టుకుంటున్నటువంటి మిమ్మల్ని నేను బయటకి విడదీస్తాను, అంతకంటే మీకు గత్యంతరం లేదు అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

మీరు అలా పని చెయ్యరు అనుకోండి, శరీరం పడిపోయిన తరువాత నీచమైన లోకాలు, క్షుద్ర లోకాలు ఎదురు చూస్తాయి మన కోసం. సోదరమహాశయులారా, భగవంతుడిని తెలుసుకోకుండా కనుక ఈ శరీరం పడిపోతే మరణించిన తరువాత మనం చీకట్లో ఉండవలసిందే కానీ వెలుగు మటుకి మన కళ్ళకి కనపడదు.

తాని సర్వాణి సంయమ్య యుక్త ఆసీత మత్పరః – ఎవడు యుక్తుడు అంటే, కుదురుగా నిర్మలంగా ఉన్నవాడు యుక్తుడు. మీ బుద్ధి మీరు చెప్పినట్టు వింటే, మీ బుద్ధి మీ స్వాధీనంలో ఉంటే మీరు యుక్తులు. 'ఎంతకాలం అలా నిద్రపోతావు? ఎన్ని జన్మలు అలా అజ్ఞానంలో ఉంటావు? ఎన్ని దేహాలను మోస్తావు, ఎన్ని లోకాలు తిరుగుతావు? భగవంతుడే నీ గమ్యం, నిద్రలేచి నడవటం ప్రారంభించి ముందుకు సాగిపో అన్నాడు స్వామివివేకానంద. భగవంతుడిని చేరే వరకూ, ఎవరు నిన్ను వెనక్కి పిలిచినప్పటికి, నీ వాసనలు నిన్ను వెనక్కి లాగుతున్నప్పటికి, నీ కోరికలు నిన్ను సమర్థిస్తున్నప్పటికి, నీ గమ్యం మర్చిపోకు, నీ గమ్యం

చేరేవరకు నువ్వు ప్రయాణం ఆపు చేయకు. ఓ మనస్సా నీ స్వస్థలానికి పొమ్ము అన్నాడు స్వామి వివేకానంద.  గంటకో రకంగా రోజుకో రకంగా మనం ఉంటున్నాం కదా, మన మనస్సే గనుక స్వస్థానంలో ఉంటే గంటకో రకంగా ఎందుకు ఉంటాం? మనస్సు యొక్క స్వస్థానం భగవంతుడే, అక్కడకి చేరుకునేవరకు నీ మనసుకి విశ్రాంతి లేదు. ఇలా శవాలు మోస్తూ ఉండవలసిందే!

మానవదేహం వచ్చింది కాబట్టి మీరు పూజలు, జపాలు చేస్తున్నారు. మళ్ళీ మానవ దేహం వస్తుంది, ఈ అవకాశం వస్తుంది అని గ్యారంటీ లేదు. ఉన్నన్ని రోజులు జాగ్రత్తగా ఉపయోగించుకోండి. మరణించిన తరువాత తీసుకెళ్ళి జంతువు శరీరంలో పెడితే, జంతువులకి భక్తి ఉన్నా ప్రార్ధన చేసే అవకాశం లేదు. మానవజన్మలో నీకు అవకాశాలు ఉన్నాయి. తెలుసుకోవాలి అనే బుద్ధి నీకు ఇచ్చాడు భగవంతుడు. ఆ బుద్ధిని ఉపయోగించుకో అంటున్నాడు భగవంతుడు వాసుదేవస్వామి.

నాకు వాళ్ళు చుట్టాలు, వీళ్ళు చుట్టాలు అని మీరు చెప్పుకుంటున్నారు కాని భగవంతుడి తోటి చుట్టరికం ఎందుకు కలుపుకోరు, భగవంతుడితో సంబంధం పెట్టుకుందామని ఎందుకు అనుకోరు? దేహానికి సంబంధించిన వారు చుట్టాలు, మనసుకి సంబంధించిన వారు స్నేహితులు అనే గొడవలోనే మీరు ఉంటున్నారు. భగవంతుడిని నిరంతరం స్మరించగా, స్మరించగా భగవంతుడి తోటి వేరుపడలేని సంబంధం మనకి ఏర్పడుతుంది. అదే భగవంతుడి తోటి మనకి ఉన్న బంధం. మనకి స్నేహితుడు, చుట్టం, తల్లి, తండ్రి అన్నీ భగవంతుడే. అందుచేత నన్ను స్మరించండి, నాతో చుట్టరికం పెట్టుకోండి, నన్ను తలపెడుతుంటే మీకు ఏది మంచిదో అది నేను చేస్తాను. మీ అంతట మీరు ఇంద్రియాలను అహంకారాన్ని జయించలేరు. నా మీద మీరు గురి పెట్టుకోండి, నన్ను ప్రేమించండి ఆ ప్రేమలో మీరు జీవించండి అని భగవంతుడు అడిగేస్తున్నాడు! మనకోసం,  మనకి అర్థం అయ్యేలా చెప్పటం కోసం ఆయన సిగ్గుకూడా విడిచి పెట్టేశాడు. నన్ను ప్రేమించండి. ఆ ప్రేమలో మీరు జీవించండి, నన్ను పొందాలనే ప్రేమలో, ఆ కాంక్షతో మీరు జీవించండి. ఆ ప్రేమలో మరణించండి అంటున్నాడు భగవంతుడు.

**(మూలం: శ్రీ నాన్నగారి ప్రవచనం – కాపవరం, 22 డిసెంబర్ 1985)**



దిll 16-04-2024
మంగళవారంనాడు
శ్రీరామ నవమి సందర్భంగా
సద్గురు శ్రీ నాన్నగారి సన్నిధి
అలంకరణ



దిll 23-04-2024 మంగళవారంనాడు పౌర్ణమి సందర్భంగా
శ్రీరమణక్షేత్రం జిన్నూరు నందు దీపం

# శంకరం శంకరాచార్యం

భారతీయ జ్ఞానమార్గాన్ని సక్రమంగా నిలబెట్టడానికి సదాశివుడే శ్రీ శంకరాచార్య రూపంలో అవతరించాడన్నది పెద్దల వాక్కు. భారతీయ తత్త్వచింతనపై అత్యంత ప్రభావం చూపిన బ్రహ్మజ్ఞాని శ్రీ ఆదిశంకరాచార్యులు. ఆయన గొప్ప పండితుడు, జగద్గురువు, తత్త్వవేత్త. తాను శరీరధారియై ఈ భూమి మీద జీవించిన కొద్దికాలంలోనే సనాతన ధర్మాన్ని పునరుద్ధరించి బలీయమైన శక్తిగా మలిచారు. కేరళ రాష్ట్రంలోని పూర్ణానది ఒడ్డున గల కాలడి గ్రామంలో ఆర్యాంబ, శివగురువు పుణ్యదంపతులకు వరప్రసాదంగా క్రీ॥శ॥ 788లో శంకరులు జన్మించారు. శంకరుని చిన్నతనంలోనే తండ్రి మరణించగా, తల్లి శంకరుని పోషణ బాధ్యత స్వీకరించి విద్యాబుద్ధులు చెప్పించింది. ఆయన ఏకసంథాగ్రాహి, చిన్నతనంలోనే సకల విద్యలు, శాస్త్రాలూ, వేద విద్యలు అభ్యసించాడు. తరువాత కాలంలో తల్లి అనుమతితో సన్యాసం స్వీకరించి, ఉత్తర భారత దేశ యాత్రకు బయలుదేరి "ఎప్పుడు తలచుకుంటే అప్పుడు నీ దగ్గర ప్రత్యక్షమౌతానని" తల్లికి మాటిచ్చి ముందుకు సాగాడు. దారిలో నర్మదా నది ఒడ్డున శ్రీగౌడపాదుల శిష్యుడైన శ్రీగోవింద భగవత్పాదులను దర్శించారు, వారిని దర్శించగానే శ్రీ శంకరాచార్యుల అలసట అంతా తీరిపోయింది. శ్రీగోవింద భగవత్పాదులు ఎవరు నువ్వు? నీవు ఎవరివి? అని ప్రశ్నించగా శంకరుడు "నేను నింగిని కాదు, భూమిని కాదు, నీటిని కాదు, అగ్నిని కాదు, గాలిని కాదు, ఎటువంటి గుణాలు లేని వాడిని, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి వీటికి అతీతమైన వాడిని, నేను శివుడను, విభజనలేని జ్ఞాన సారాన్ని" అని బదులిచ్చాడు. అటువంటి అద్వైత సంబంధమైన మాటలు పలికిన శంకరుని చూసి గోవింద భగవత్పాదులు "సాక్షాత్తు భూమికి దిగి వచ్చిన పరమశివుడే ఈ శంకరాచార్యులు" అని పలికారు. పిమ్మట గోవింద భగవత్పాదులు శంకరునికి బ్రహ్మజ్ఞానాన్ని, ఉపనిషత్తుల సారాన్ని బోధించారు. శంకరాచార్యులు శిష్యులతో సహా దేశమంతా కాలినడకన తిరిగి జ్ఞానబోధ చేసారు. కొంతకాలము కాశీ వాసము చేసి, జీవిత చివరిదశలో బదరీనాథ్, కేదార్‌నాథ్‌లను దర్శించి, చివరికి కేదార్‌నాథ్‌లో విదేహముక్తుడయ్యాడు. అనేక స్తోత్ర, భాష్య, ప్రకరణ గ్రంథాలను రచించి భారతీయ సంస్కృతికి ఎనలేని సేవచేసి, పరమపూజ్యునిగా, జగద్గురువుగా, పూజలందుకొంటున్నారు.

**(దిII 12-05-2024 శ్రీ శంకర జయంతి సందర్భముగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**